సాక్షి వికారాబాద్

మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



ముంచిన అతివృష్టి

ఇటీవల విరామం లేకుండా కురిసిన భారీ వర్షాలకు అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. 8లో▸



ఇసుక దందా!

ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత ఇసుక అక్రమార్కులకు సిరులు కురిపిస్తోంది. 8లో▸



ఆందోళన కలిగిస్తున్న..

చెరువులు, ప్రాజెక్టుల వద్ద సరదాగా గడిపేందుకు వెళ్తున్న పలువురు నీట మునిగి మృత్యువాత పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ఎంపీ కొండాను కలిసిన కుల్కచర్ల నేతలు



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో మండల నాయకులు

కుల్కచర్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఎక్కువ స్థానాల్లో గెలిచేలా నాయకులు కృషి చేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ మండల నాయకులు ఎంపీ కొండాను నగరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికలపై దృష్టి సారించాలని ఎంపీ సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మైపాల్, నాయకులు మల్లేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

దోమ: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దొంగఎన్కేపల్లిలో శ్రీ వీరభద్ర సమేత భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని అర్చకులు వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు దైవభక్తిని పెంపొందించుకోవాలన్నారు. భక్తితోనే మానసిక ప్రశాంతత పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్ కుమార్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యాదవ రెడ్డి, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం మన బాధ్యత

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్



బాలుడి రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్

బొంరాస్‌పేట: పేదలకు మెరుగైన వైద్యం అందించడం మన బాధ్యత అని టీబీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్, డిప్యూటీ డీఎం హెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ అన్నారు. సోమవారం బొంరాస్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని వడిచర్ల తండాకు చెందిన శ్రీను, గౌరిబాయి దంపతుల కొడుకు జగన్(5) న్యూరో సమస్యతో బాధపడుతున్నట్లు తెలుసుకొన్నారు. వైద్యం కోసం రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బాలుడి వైద్యం అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ హేమంత్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

12న పద్మశాలీ సంఘం దసరా మేళా

హుడాకాంప్లెక్స్: ఆటోనగర్‌లోని హరిణ వనస్థలి అనన్య ఎకోపార్కులో ఈ నెల 12న పద్మశాలీ సంఘం 23వ దసరా మేళా నిర్వహిస్తున్నట్టు సంఘం ఎల్‌బీనగర్ అధ్యక్షుడు పున్న గణేశ్ నేత తెలిపారు. హుడా కాంప్లెక్స్‌లోని సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేళాలో పద్మశాలి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించుకోవడంతో పాటు ప్రముఖుల సంక్షిప్త సందేశాలు, చేనేత కళాకారులకు సన్మానాలు, సమాజ శ్రేయస్సుకు సహకరిస్తున్న పెద్దలకు సన్మానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి మాట్లాడుతూ.. పద్మశాలీల ఐక్యతకు ఈ మేళా తోడ్పడుతుందని అన్నారు. సమావేశంలో సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటక రూపా సదాశివ్, అఖిల భారత పద్మశాలి యువజన విభాగం అధ్యక్షుడు అవ్వారు భాస్కర్, గుర్రం శ్రావణ్, గడ్డం లక్ష్మీనారాయణ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కత్తుల సుదర్శన్, స్వప్న, రేఖ, ఊర్కొండ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ మంటలు

- తరచూ రోడ్డెక్కి నిరసనలు
- మా భూముల జోలికి రావొద్దని హెచ్చరిక
- బలవంతంగా లాక్కుంటే చావే శరణ్యమంటున్న బాధితులు
- ధర్నాకు సిద్ధమవుతున్న పూడూరు, నవాబుపేట మండలాల రైతుల అరెస్ట్

అలైన్‌మెంట్ మార్చడంతో అన్నదాతల పోరుబాట



చన్గోముల్ పోలీసుల అదుపులో రైతులు

పూడూరు: ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చడంపై బాధిత రైతులు పోరుబాట పట్టారు. మా భూములు తీసుకుంటే వీధిన పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బలవంతంగా లాక్కుంటే చావే శరణ్యమని అంటున్నారు. పూడూరు మండల పరిధిలోని తుర్క ఎన్కేపల్లి, కంకల్, నిజాంపేట్ మేడిపల్లి, మంచన్‌పల్లి, గట్టుపల్లి, సిరిగాయపల్లి, కెరవెళ్లి, రాకంచర్ల, పెద్ద ఉమ్మెంతాల్, పూడూరు, గొంగుపల్లి, ఎన్కేపల్లి తదితర గ్రామాల మీదుగా రీజినల్ రింగ్ రోడ్డు వేయనున్నారు. దీంతో రైతులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మా భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు. పెద్దల కోసం మూడు సార్లు అలైన్‌మెంట్ మార్చి పేదల కడుపుకొట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ తీరును తప్పుపడుతూ ధర్నాలు చేస్తున్నారు. పాత అలైన్‌మెంట్ ప్రకారమే రోడ్డు వేయాలని పలువురు డిమాండ్ చేశారు. తామంతా పొలాలను నమ్ముకొనే జీవనం సాగిస్తున్నామని, బలవంతంగా భూములు లాక్కుంటే గ్రామాలు వదిలి వలస వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఎంతో కష్టపడి భూములు కొనుగోలు చేశామని.. ఏడాదికి మూడు పంటలు తీస్తున్నామని, ఇలాంటి పొలాలను అభివృద్ధి పేరిట తీసుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని విరమించుకోవాలి లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. సోమవారం నగరంలోని హెచ్‌ఎండీఏ కార్యాలయం వద్ద ధర్నాకు సిద్ధమవుతున్న సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్, పూడూరు రైతులు తాజొద్దీన్, నర్సింహారెడ్డి, సాయన్న, అనీల్, జంగయ్యను అరెస్టు చేసి చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఏ మండలంలో ఎన్ని ఎకరాలంటే..

జిల్లాలోని మోమిన్‌పేట్ మండలంలో రెండు గ్రామాల్లో 300 ఎకరాలు, నవాబుపేట మండలంలో 400 ఎకరాలు, పూడూరు మండలంలో 11 గ్రామాల్లో 1,000 ఎకరాలు, వికారాబాద్ మండలంలోని నాలుగు గ్రామాల్లో 600 ఎకరాల భూమి పోతుంది. పాత అలైన్‌మెంట్‌లో 189కిలో మీటర్లు ఉండగా, రెండో అలైన్‌మెంట్‌లో 201 కిలో మీటర్లకు పెంచారు. తాజాగా 218 కిలో మీటర్లకు మార్చాలని భూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'రేడియల్'కు వందల ఎకరాలు

గతంలో ఉన్న ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి ట్రిపుల్ ఆర్ వరకు రేడియల్ రోడ్డు వేసేందుకు షాబాద్ మండలం మీదుగా పూడూరు మండలంలోని పుడుగుర్తి, కంకల్, మంచన్‌పల్లి, గట్టుపల్లి, మాదారం రంగాపూర్ గ్రామాల మీదుగా అనుసంధానం చేయనున్నారు. రైతులు వందల ఎకరాల్లో భూములు కోల్పోనున్నారు.

అరెస్టు దారుణం

ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులను అరెస్టు చేయడం దారుణమని సొసైటీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం తెల్లవారుజామున పోలీసులు సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్, పూడూరు రైతులు తాజొద్దీన్, నర్సింహారెడ్డి, సాయన్న, అనీల్, జంగయ్యను అరెస్టు చేసి చన్గోముల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై రైతులను విడిచిపెట్టారు.

మార్కెట్ ధర చెల్లించాలి



కొత్త అలైన్‌మెంట్‌తో చాలా మంది పేద రైతులే భూములు కోల్పోతున్నారు. బలవంతంగా తీసుకోవాలని చూస్తే ఊరుకోం. భూమికి భూమి ఇవ్వాలి. లేకుంటే మార్కెట్ ధర రూ.2 కోట్లు చెల్లించాలి. నామమాత్రపు పరిహారానికి ఒప్పుకోం. అభివృద్ధికి ఎవరూ అడ్డు చెప్పరు. అదే సమయంలో రైతుల సంక్షేమం కూడా చూడాలి.

– గోవర్ధన్‌రెడ్డి, బాధిత రైతు

అంతా పేద రైతులే



పూడూరులో చాలా మంది పేద రైతులే ఉన్నారు. రెండెకరాల్లో ఎకరం భూమి పోతే జీవనం ఇబ్బందిగా మారుతుంది. ఇక్కడి రైతులు ఏడాదికి మూడు పంటలు తీస్తున్నారు. కొత్త అలైన్‌మెంట్‌తో అందరికి తీరని నష్టం. నవాబులది పోతలే.. చిన్న సన్నకారు రైతులదే పోతోంది. పాత అలైన్‌మెంట్ ప్రకారమే రోడ్డు వేయాలి

– నర్సింహారెడ్డి, పూడూరు

రైతుల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో ట్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితులు

నవాబుపేట: ట్రిపుల్‌ఆర్ కొత్త అలైన్‌మెంట్‌కు నిరసనగా ధర్నాకు సిద్ధమైన రైతులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మండలంలోని చించల్‌పేట, చిట్టిగిద్ద గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులు నగరంలోని హెచ్‌ఎండీఏ కార్యాలయం వద్ద ధర్నాకు సిద్ధమయ్యారు. దీంతో పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేసి నవాబుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు స్టేషన్‌కు చేరుకొని రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వమని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ రైతులను అరెస్టు చేయడం ఏమిటని నిలదీశారు. బాధితులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు. త్వరలో సీఎం ఇంటిని ముట్టడిస్తామన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఎస్పీ నారాయణరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి వెంటనే రైతులను విడుదల చేయాలని కోరినట్లు తెలిసింది. అనంతరం రైతులను విడిచిపెట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద్, నాగేందర్‌గౌడ్, భరత్‌రెడ్డి, విజయ్‌కుమార్, పురుషోత్తం, కృష్ణారెడ్డి, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన బస్సు చార్జీలు తగ్గించాలి




ఇబ్రహీంపట్నం డిపో వద్ద మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం: పెంచిన బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ డిమాండ్ చేశారు. పెంచిన చార్జీలను నిరసిస్తూ సోమవారం ఇబ్రహీంపట్నం డిపో వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. ఆర్టీసీని రేవంత్ సర్కార్ నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కింద ఆర్టీసీకి చెల్లించాల్సిన రూ.3 వేల కోట్లు బకాయి పడిందని తెలిపారు. ఈ నష్టాన్ని పూడ్చుకునేందుకు చార్జీలను పెంచిందన్నారు. సుమారు 25 వేల మంది ఆర్టీసీ కార్మికులు కో–ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసుకొని జమ చేసుకున్న రూ.వెయ్యి కోట్లను గజదొంగ మాదిరిగా రేవంత్ సర్కార్ ఖాళీ చేసిందని ఆరోపించారు. పెంచిన చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బోసుపల్లి ప్రతాప్, గొగిరెడ్డి లచ్చిరెడ్డి, నర్సింహారెడ్డి, రాంరెడ్డి, ధనంజయ్‌గౌడ్, రాఘవేందర్, అనిల్‌కుమార్, శివకుమార్, గోవర్ధన్, శివధర్‌రెడ్డి, సందీప్, ముత్యాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విధానాలను ఎండగట్టాలి: ఎమ్మెల్యే సబిత

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలు, మోసపూరిత వాగ్దానాలకు నిదర్శనమే బాకీ కార్డు అని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ నేతలతో కలిసి బాకీ కార్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆచరణ సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లో పూర్తి చేస్తామన్న ఆరు గ్యారంటీలను 700 రోజులైనా పూర్తి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి, ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు హన్మగళ్ల చంద్రయ్య, కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్, మండల అధ్యక్షుడు రాజు నాయక్ పాల్గొన్నారు.



బాకీ కార్డులను ఆవిష్కరిస్తున్న సబితారెడ్డి



హస్నాబాద్ చెరువు వద్ద చేపల వేట

వరద నీటిలో చేపల వేట

ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, కుంటల్లోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో చేపలు ఎదురెక్కుతున్నాయి. వలలతో వచ్చిన ప్రజలు, వేటగాళ్లు వీటిని పట్టుకునేందుకు పోటీపడ్డారు. హస్నాబాద్ చెరువు వద్ద చేపలు పట్టేందుకు పదుల సంఖ్యలో స్థానికులు తరలివచ్చారు. – దుద్యాల్



ఎన్నికల వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఎన్నికలు సజావుగా నిర్వహిస్తాం

జిల్లాలో మూడు విడతల్లో పోలింగ్

- కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- అభ్యర్థుల ఖర్చులపై నిఘా ఉంచుతాం
- సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని కలెక్టర్ ప్రతీక్‌జైన్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ సుధీర్, డీపీఓ జయసుధ, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్‌చౌదరితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు పలు సూచనలు చేశారు. నామినేషన్లు, ఓటింగ్ తదితర ఏర్పాట్లుకు సంబంధించి జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు వివరించారు.

కలెక్టర్ సూచనలు

- జిల్లాలో గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు మూడు విడతల్లో జరుగుతాయి. మొదటి, రెండవ విడతలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు.. రెండు, మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయి.
- మొదటి విడతలో కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని నాలుగు(మన జిల్లా పరిధిలోకి వచ్చే) మండలాలు, చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని నవాబుపేట, వికారాబాద్ నియోజకవర్గం పరిధిలోని మండలాల్లో జిల్లా పరిషత్, మండల ఎన్నికలు జరుగుతాయి.
- రెండో విడతలో తాండూరు నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాలు, పరిగి నియోజకవర్గం పరిధిలోని (మన జిల్లా పరిధిలోకి వచ్చే) ఐదు మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో 20 జెడ్పీటీసీ, 227 ఎంపీటీసీ స్థానాలు ఉండగా మొదటి విడతలో 115 స్థానాలకు, రెండో విడతలో 112 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి.
- రెండో విడతలో 11 మండలాల పరిధిలోని 288 గ్రామ పంచాయతీలు, 2,490 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. మూడో విడతలో తొమ్మిది మండలాల పరిధిలోని 306 గ్రామ పంచాయతీలు, 2,568 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.
- జిల్లాలో 6,98,472 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 3,43,668 మంది పురుషులు, 3,54,788 మంది స్త్రీలు, 16 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. 1,289 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు నిర్వహించనున్నారు. అదనంగా 25 శాతం బ్యాలెట్ బాక్సులను అందుబాటులో ఉంచారు.
- జిల్లాలో నామినేషన్ల దాఖలకు నాలుగు సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 9 నుంచి నామినేషన్ల స్వీకరించనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.
- నామినేషన్ పత్రాలు, అఫిడవిట్ ఫారాలను ఆర్‌ఓల నుంచి పొందవచ్చు.
- నామినేషన్ ఫారం నింపే సమయంలో ఏమైనా ఇబ్బందులు వస్తే ఎన్నికల రిటర్నింగ్ అధికారుల సలహాలు సూచనలు పొందవచ్చు.
- ఒక్కో జెడ్పీటీసీ అభ్యర్థి రూ.4 లక్షల వరకు ఖర్చు చేయవచ్చు. ఐదు వేలకు పైగా జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో రూ.2.5 లక్షలు, వార్డు సభ్యులు రూ.50 వేల వరకు ఖర్చు చేయవచ్చు. ఐదు వేలలోపు జనాభా ఉన్న జీపీల్లో అభ్యర్థులు రూ.50 వేలు, వార్డు సభ్యులు రూ.30 వేల వరకు ఖర్చు చేయవచ్చు.
- నిబంధనలకు మించి ఖర్చు చేస్తే అభ్యర్థులు అనర్హతకు గురవుతారు. ఖర్చుల నిర్వహణపై నిఘా ఉంటుంది.
- కోడ్ పక్కాగా అమలుకు ప్రత్యేక టీంలు ఉంటాయి.
- జిల్లాలో ఎన్నికల నిర్వహణ, ఎంసీసీ అమలు కోసం 12 మంది నోడల్ ఆఫీసర్లు, 105 మంది జోనల్ స్థాయి అధికారులు, 45 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 59 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, 20 ఎంసీసీ బృందాలు పని చేస్తాయి.
- పరిమితికి మించి డబ్బు తరలిస్తే సీజ్ చేస్తాం. సీజ్ చేసిన నగదు తీసుకునేందుకు రెండు రకాల ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. ఒకటి ఆ నగదు ఎందుకు.. ఎక్కడికి తీసుకెళ్తున్నారు.. రెండోది పట్టుబడిన నగదు ఎన్నికల ఖర్చు కోసం కాదు అని నిరూపించాల్సి ఉంటుంది.
- వికారాబాద్, పరిగి, తాండూరు పట్టణాల్లో స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేసి.. అక్కడే బ్యాలెట్ బాక్సులు భద్రపరుస్తారు. వికారాబాద్, పరిగి, తాండూరు, పరిగి కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రి తరలింపు ఉంటుంది.
- మూడు రకాల పోస్టల్ బ్యాలెట్లు అందజేసారు. ఇందులో ఒకటి సీనియర్ సిటిజన్స్(80 సంవత్సరాలు) కోసం. రెండోది ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగుల కోసం, మూడోది సర్వీస్ ఓటర్ల కోసం పోస్టల్ బ్యాలెట్ అమలు చేస్తారు. ఇందుకోసం సంబంధిత ఆర్‌ఓలకు దరఖాస్తు చేసుకోవాలి.
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేపడతారు. గుర్తించిన ప్రదేశాల్లో, పోలింగ్ స్టేషన్ల బయట కూడా వీడియో చిత్రీకరణ ఉంటుంది.
- డబ్బు, మద్యం రవాణా అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో, అంతర్ జిల్లా, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తారు. ఈ చెక్ పోస్టులు 24 గంటలు పని చేయనున్నాయి.

అధికారులదే కీలక పాత్ర



పాల్గొన్న ఎన్నికల సిబ్బంది, అధికారులు

అనంతగిరి: ఎన్నికలు సజావుగా జరగాలంటే అధికారులదే కీలక పాత్ర అని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. నోడల్ ఆఫీసర్లు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ సమన్వయంతో పని చేయాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. విధులు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. సమావేశంలో తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, డీఆర్‌క్ష మంగీలాల్, ఆర్‌డీఓ వాసుచంద్ర, ఆర్‌అండ్‌బీ ఈఈశ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్టా పరిచయంతో పార్టీ

- ఫాంహౌస్‌పై పోలీసుల దాడి
- ఏడుగురిపై కేసు

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని చెర్రీ ఓక్స్ ఫాంహౌస్‌లో ఆదివారం రాత్రి ట్రాప్ హౌస్ – 9 ఎంఎం పేరిట నిర్వహించిన ఈవెంట్‌పై రాజేంద్రనగర్ ఎస్ఓటీ, మొయినాబాద్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు ఫాంహౌస్‌పై దాడి చేసి అనుమతి లేకుండా ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. పార్టీలో పాల్గొన్న 62 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిలో 40 మేజర్లు, 22 మంది యువతుల్లో ఐదుగురు మైనర్లను గుర్తించామన్నారు. నిర్వాహకుడు ఇషామ్‌తో పాటు ఇద్దరు ఆర్గనైజర్లు, ఫాంహౌస్ ఓనర్, మేనేజర్, ఇద్దరు డీజేపీ ఆపరేటర్లపై కేసు నమోదు చేశామని.. మిగిలిన వారికి నోటీసులిచ్చామన్నారు.

క్లుప్తంగా

కులం పేరుతో ధూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య


మాట్లాడుతున్న మల్కయ్య తదితరులు

యాలాల: కులం పేరుతో ధూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్‌లో దుర్గామాత నిమజ్జనం సందర్భంగా గ్రామానికి చెందిన మ్యాతరి వెంకటయ్య మెడలోంచి మహిపాల్ అనే వ్యక్తి టవల్ తీసేశాడు. ఈ విషయమై ఈ నెల 3న వెంకటయ్య మహిపాల్‌ను నిలదీయగా కులం పేరుతో ధూషించి దాడి చేశారని పేర్కొన్నాడు. సీఎం జిల్లాలో దళితులపై రోజుకొక గ్రామంలో దాడులు జరగడం అన్యాయమన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా వెంకటయ్యపై దాడికి పాల్పడ్డ మహిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, వెంకటయ్య, నర్సమ్మ, రవికుమార్, అనంతప్ప, లాలు ప్రసాద్, ఎల్లమ్మ తదితరులు ఉన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగి బలవన్మరణం


రాములు (ఫైల్)

నవాబుపేట: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం చిట్టిగిద్ద గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ పుండ్లిక్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన జంగ రాములు(50) శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ సర్కిల్ నంబర్ 20లో 20 ఏళ్లుగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. గ్రామంలో 1.05 ఎకరాల పొలం ఉండగా ఈ ఏడాది పత్తి సాగు చేశాడు. వర్షాలకు పంట పూర్తిగా పాడైంది. ఆయన కుమారులు వెంకటేశ్ డిగ్రీ మొదటి సంవత్సరం, నిఖిల్ 10వ తరగతి చదువుతున్నాడు. కూతురు శిరీష అనారోగ్యంతో ఇంటి వద్దే ఉంటోంది. రాములు రోజు మాదిరి గానే సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్లాడు. ఇంటి సమీపంలో చింత చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు పోలీసులకు తెలపడంతో మృతదేహానికి వికారాబాద్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య సునీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టింటికి వచ్చిన మహిళ అదృశ్యం


బాలమణి(ఫైల్)

దుద్యాల్: పండుగకు తల్లిగారింటికి వచ్చిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన దుద్యాల్ ఠాణా పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ యాదగిరి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పోలేపల్లికి చెందిన కొత్తూరు బాలమణికి పొరుగు రాష్ట్రానికి చెందిన రాజుతో వివాహమైంది. వీరు కొన్నాళ్లుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటూ జీవన సాగిస్తున్నారు. దసరా నేపథ్యంలో ఈ నెల 1వ తేదీన పోలేపల్లికి బాలమణి తన కుమారుడితో కలిసి వచ్చింది. ఆమెకు కుమారుడు కొడంగల్ గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. దీంతో ఈ నెల 5వ తేదీన బాబును పాఠశాలకు పంపిస్తానని తల్లి అంజిలమ్మకు చెప్పి బయలుదేరింది. పాఠశాలలో బాబును వదిలిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభ్యం కాకపోవడంతో అంజిలమ్మ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపులో పడి.. చిన్నారి మృతి


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

కొందుర్గు: సంపులో పడి చిన్నారి మృతిచెందిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం చేగిరెడ్డి ఘనాపూర్‌లో చోటుచేసుకుంది. చౌదరిగూడ ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన శిరీషకు ఎనిమిదేళ్ల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం కొల్లూరుకు చెందిన శ్రీనుతో వివాహమైంది. వీరికి ముగ్గురు కూతుళ్లు. రెండు నెలల క్రితం భర్తతో గొడవపడిన శిరీష పిల్లలను తీసుకొని పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో సోమవారం ఆమె ఇద్దరు కూతుళ్లను తన పెద్దమ్మ యాదమ్మ ఉంచి పెద్ద కూతురు అనారోగ్యంతో ఉండడంతో ఆస్పత్రికి తీసుకెళ్లింది. తిరిగి వచ్చేసరికి చిన్న కూతురు ధన్విక (13 నెలలు) కనిపించలేదు. ఇంటి ఎదుట నీటిసంపులో చూడగా మృతదేహం తేలియాడుతూ కనిపించింది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముంచిన అతివృష్టి

విరామం లేకుండా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో(అతివృష్టి) అన్నదాతలకు కంటి మీద కునుకు కరువైంది. పంటలన్నీ నీట మునగడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కనీసం పెట్టుబడులు సైతం రాని దుస్థితి దాపురించిందని వాపోతున్నారు. తాండూరు నియోజకవర్గ పరిధిలో పత్తి, కంది, మినుము, పెసర వరి తదితర రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అప్పుల ఊబిలోకి కురుకుపోయే ఆస్కారం ఉందని రోదిస్తున్నారు. తమని ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


తాండూరురూరల్: గుండ్లమడుగుతండాలో దెబ్బతిన్న కంది పంటను చూపిస్తున్న రైతులు

వరద ఉధృతికి నీట మునిగిన పంటలు

- అన్నదాతలకు భారీఎత్తున నష్టం
- పెట్టుబడులు సైతం రావని ఆందోళన
- ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి

తాండూరు రూరల్: ఎండా, వాన, చలి అనే తేడా లేకుండా ఆరుగాలం శ్రమించే అన్నదాతల బతుకులు ఆగమయ్యాయి. భారీ వర్షాలకు తాండూరు మండలంలో తీవ్ర నష్టం వాటిల్లింది. స్థానికంగా ఎక్కువగా కంది పంటను సాగు చేస్తున్నారు. 17,300 ఎకరాల్లో కంది వేయగా.. 1,635 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. 6,140 ఎకరాల్లో పత్తి సాగు చేయగా 1,820 ఎకరాల్లో నష్టం కలిగింది. పెసర పంట రెండు వేల ఎకరాల్లో సాగు చేస్తే 1,100 ఎకరాలు తుడిచిపెట్టుకు పోయింది. మినుము 1,635 ఎకరాల్లో సాగు చేస్తే 1,200 ఎకరాల్లో నష్టపోయిందని అధికారుల అంచనా. పెసర, మినుము పంటలు 70 శాతం వరకు నష్టపోయినట్లు గుర్తించారు. పంట నష్టం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి కొమురయ్య తెలిపారు. గుండ్లమడుగుతండా వద్ద వర్షాలకు కంది పంట పూర్తిగా నాశనం అయిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

నల్లబారిన పత్తికాయలు

బషీరాబాద్: మండలంలో వర్షాధార పంటలే ఎక్కువ. వానాకాలంలో పత్తి, కందితో పాటు పెసర, మినుము పంటలు సాగు చేశారు. పత్తి 13,057 ఎకరాలు, కంది 14,885, పెసర 1,269, మినుము 372 ఎకరాల్లో సాగు చేశారు. భారీ వర్షాలకు పత్తి పంట సుమారు 70శాతం మేర నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. పంటలో నీళ్లు నిలవడంతో చెట్టు ఎదగలేదు. కాసిన కాయలు నల్లబారి పోయాయి. కాగ్నా పరివాహక గ్రామాలైన మంతట్టి, కంసాన్‌పల్లి(ఎం), జీవన్గీ, క్యాద్గీరా, గంగ్వార్, నావంద్గీ, ఇందర్‌చెడ్ గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాలకుపైనే పత్తి, కంది పంటలను వరదలు తుడిచి పెట్టాయి.


నావంద్గీ వద్ద కాగ్నానది వరదకు తుడిచిపెట్టుకుపోయిన పత్తి

రేగడి నేలల్లో కంది పంట రంగుమారి పోతుంది. ఈ పంట సుమారు 50 శాతం వరకు పాడైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

రూ.2 లక్షలు వరదపాలు



ఖరీఫ్‌లో 11 ఎకరాల్లో పత్తి, కంది పంటలు సాగు చేశా. వీటికి రూ.2లక్షల పైనే ఖర్చు చేశాను. మందులు, ఎరువుల కోసం షావుకారి వద్ద ఉద్దెర తీసుకొచ్చి వాడాను. కాగ్నానది నాలుగు సార్లు పంటలపై విరుచుకు పడింది. దీంతో రెండు పంటలు పూర్తిగా కొట్టుకు పోయాయి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– లక్ష్మణ్, రైతు, నావంద్గీ

ఉప్పొంగిన కాకరవేణి, కాగ్నా

యాలాల: మండలంలో ఎక్కువగా వరి, కంది, పత్తి పంటలను సాగు చేస్తుంటారు. భారీ వర్షాలకు రాస్నం, అగ్గనూరు, జుంటుపల్లి క్లస్టర్ల పరిధిలో పంటలు దెబ్బతిన్నాయి. కాకరవేణి, కాగ్నా నదులు ఉప్పొంగడంతో భూములు కోతకు గురి కావడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఏకధాటిగా కురిసిన వానలకు పత్తి పంట నల్లబారింది. ఇప్పటివరకు వ్యవసాయ శాఖ అధికారులు వంద ఎకరాలకు పైగా పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు.


బాగాయిపల్లి శివారులో వర్షాలకు రంగు మారిన పత్తి

పరిహారం అందించాలి



భారీ వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రకృతి వైపరీత్యంతో జరిగిన ఈ నష్టంలో ప్రభుత్వం రైతులకు అండగా నిలబడాలి. బయటి నుంచి అధిక వడ్డీకి తీసుకొచ్చి పెట్టుబడులు పెట్టాం. ప్రస్తుతం దిగుబడి వచ్చే అవకాశం లేకపోవడంతో ఆందోళకు గురవుతున్నాం. ప్రభుత్వమే తమని ఆదుకోవాలి.

– శేఖర్, రైతు, అడాల్‌పూర్

పంటలు దెబ్బతిన్నాయి



మండలంలో కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికే రాస్నం, అగ్గనూరు, జుంటుపల్లి క్లస్టర్ల పరిధిలో ఏఈఓలతో పంట ఎంత మేర నష్టం జరిగిందో వివరాలు సేకరిస్తున్నాం. ఉన్నతాధికారులు సూచిస్తే వెంటనే వివరాలు పంపేలా చర్యలు తీసుకుంటున్నాం.

– శ్వేతారాణి, ఏఓ, యాలాల

'ఇందిరమ్మ' పేరుతో.. ఇసుక దందా!


ఇందర్‌చెడ్‌లోని ఓ ఇంటి ఎదుట డంప్ చేసిన ఇసుక


విచారణ చేస్తున్న ఆర్ఐ సుధ, పోలీసులు

- అనుమతులు లేకుండా అడ్డగోలు రవాణా
- ఇందర్‌చెడ్‌లో విచారణ చేపట్టిన అధికారులు
- అక్రమార్కులపై చర్యలకు స్థానికుల డిమాండ్

బషీరాబాద్: ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత ఇసుక అక్రమార్కులకు సిరులు కురిపిస్తోంది. ఎలాంటి అనుమతులు లేకుండా కాగ్నానదిని కొల్లగొడుతూ అడ్డగోలు రేటుకు అమ్ముకుంటున్నారు. మండల పరిధిలోని ఇందర్‌చెడ్‌లో కొంత కాలంగా ఇసుక దందా జోరుగా సాగుతున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

లబ్ధిదారులకు భారం

ఇందర్‌చెడ్‌లో సుమారు 15 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వీరిలో చాలా మంది లబ్ధిదారులు పనులు చేపట్టారు. ఇందుకోసం అవసరమయ్యే ఇసుకను గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా కాగ్నానది నుంచి తోడుకొచ్చి ఒక్కో ట్రాక్టర్ రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. గ్రామంలో ఎవరికి ఇసుక అవసరమైనా తానే రవాణా చేస్తానని, మిగిలిన వారెవరైనా ఇసుక వేస్తే పోలీసు కేసులు పెట్టిస్తానని బెదిరిస్తుంటాడని గ్రామస్తులు చెబుతున్నారు. తమకు ఉచితంగా లభించాల్సిన ఇసుకను అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని ఇందిరమ్మ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి అండదండలతోనే సదరు వ్యక్తి ఇలా రెచ్చిపోతున్నాడని చెబుతున్నారు. ఈవిషయమై పలువురు ఫిర్యాదు చేయడంతో సోమవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధ, పోలీసులు గ్రామానికి చేరుకొని విచారణ జరిపారు. ఇందిరమ్మ లబ్ధిదారులతో మాట్లాడారు. ఎలాంటి అనుమతులు లేకుండా వీరికి ఇసుక రవాణా చేసినట్లు గుర్తించారు. ఇప్పటికైనా అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. లేదంటే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు.

బంగారానికి మెరుగు పెడతామని..

- మత్తుమందు చల్లి వృద్ధురాలి నగలు దోచుకెళ్లిన దుండగులు
- నిందితులకు దేహశుద్ధి చేసిన గ్రామస్తులు


గ్రామస్తులు పట్టుకున్న దొంగలు

షాద్‌నగర్‌రూరల్: బంగారానికి మెరుగు పెడుతామంటూ ఇద్దరు దుండగులు ఓ వృద్ధురాలిని బురిడీ కొట్టించారు. మత్తు మందు చల్లి ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. గ్రామస్తులు వారిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మండల పరిధిలోని వెలిజర్లలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ విజయ్‌కుమార్, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన వృద్ధురాలు బ్యాగరి చిన్నమ్మ ఇంటికి సోమవారం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. బంగారం, వెండి ఆభరణాలకు మెరుగు పెడుతాం అంటూ నమ్మించారు. దీంతో ఆమె తన వెండి కడియాలను ఇవ్వడంతో శుభ్రం చేసి ఇచ్చారు. అనంతరం మెడలో ఉన్న తులంన్నర బంగారు గుండ్ల హారాన్ని ఇచ్చింది. నిందితులు స్టవ్‌పై గిన్నె ఉంచి నీళ్లు, పసుపు వేసి అందులో బంగారు దండ వేసినట్లు నటించారు. దండ తెల్లగా అయ్యిందని దాన్ని టిఫిన్ బాక్స్‌లో పెట్టామని వృద్ధురాలికి చెప్పారు. అంతలోనే ఆమెపై మత్తు మందు చల్లి నగలతో ఉడాయించారు.

తేరుకున్న వృద్ధురాలు

కాసేపటికి తేరుకున్న వృద్ధురాలు చిన్నమ్మ విషయాన్ని చుట్టు పక్కల వారికి చెప్పింది. దీంతో గ్రామస్తులు అప్రమత్తమై గ్రామంలోకి కొత్తగా వచ్చిన వారిని గుర్తించే పనిలో పడ్డారు. గ్రామంలోని ఓ టీకొట్టు వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఉన్నట్లు గుర్తించారు. వారిని గ్రామ పంచాయతీ వద్దకు తీసుకువచ్చి దేహశుద్ధి చేయడంతో చోరీ చేసినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు నిందితులను ఠాణాకు తరలించారు.

స్థల వివాదంలో ఘర్షణ

ఇరువర్గాలపై కేసు

కుల్కచర్ల: ఓ స్థలం విషయంలో ఘర్షణ పడిన ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన కుల్కచర్ల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రమేశ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ముజాహిద్‌పూర్‌కు చెందిన దోమ వెంకటయ్య, దోమ తిరుపతయ్య గ్రామ పరిధిలోని ఓ స్థలం విషయంలో ఆదివారం సాయంత్రం గొడవ పడ్డారు. దీంతో ఇరువర్గాలకు గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న నర్సింలు

పరిగి: తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. శాంతినగర్ కాలనీకి చెందిన నర్సింలు మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆయన మానస్థితిని కోల్పోయి ఉదయం ఛాత్రజీ ఆస్పత్రి భవనంపై నుంచి దూకాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగలపై పడ్డాడు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేక పోవడంతో ప్రమాదం తప్పింది. తీగలపై నుంచి కిందపడడంతో స్వల్పగాయాలయ్యాయి. వెంటనే ఛత్రాజీ ఆస్పత్రిలో చికిత్స అందించి క్షతగాత్రుడిని ఇంటికి పంపించారు.

ఉద్దేశపూర్వకంగానే దాడులు


మాట్లాడుతున్న మేఘనాథ్‌గౌడ్

తాండూరు రూరల్: కొంతమంది వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే దళితులపై దాడులు చేస్తున్నారని సంగెంకలాన్ మాజీ సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్ ఆరోపించారు. దాడిలో గాయపడి తాండూరులోని జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎరుకుల సంతోష్‌ను సోమవారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంగెంకలాన్‌లో జరిగిన గొడవపై బీజేపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. దళితుడైన సంతోష్‌తో పాటు అతని బావ యాదయ్యపై దాడి చేసి, తీవ్రంగా గాయపర్చారని ఆవేదన వ్యక్తంచేశారు.

పనిఒత్తిడే ప్రాణం తీసింది

- సీసీఐ ఎదుట మృతుడి కుటుంబ సభ్యుల ఆందోళన
- న్యాయం చేయాలని కార్మికులు, కాంగ్రెస్ నాయకుల డిమాండ్
- యాజమాన్యం హామీతో శాంతించిన నిరసనకారులు



కార్మికుడి మృతదేహంతో సీసీఐ ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు


ఖజామియా(ఫైల్)

తాండూరు రూరల్: బ్రెయిన్ స్ట్రోక్ గురై చికిత్స పొందుతున్న సీసీఐ కార్మికుడు ఆదివారం మృతిచెందాడు. దీంతో ఆగ్రహించిన బాధిత కుటుంబ సభ్యులు, తోటికార్మికులు, కాంగ్రెస్ నాయకులు సోమవారం మృతదేహంతో ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన నిర్వహించారు. వీరు తెలిపిన వివరాల ప్రకారం.. కరన్‌కోట్‌కు చెందిన మర్పల్లి ఖాజామియా(45) సీసీఐ ఫ్యాక్టరీ ప్యాకింగ్ ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గత గురువారం రాత్రి పనికి వెళ్లగా ప్యాకింగ్ పనులకు బదులు ప్లాంట్‌లో నిలిచిన వరద నీటిని బకెట్లతో ఎత్తి బయటపోయాలని కాంట్రాక్టర్ ఆదేశించాడు. రాత్రి వేళ చల్లని గాలి వీస్తుండగా సుమారు ఆరు గంటల పాటు నీళ్లలో ఉండటంతో అనారోగ్యానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే కార్మికులు అతన్ని తాండూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఇందుకోసం కంపెనీ అంబులెన్స్ ఇవ్వాలని కోరినా యాజమాన్యం పట్టించుకోలేదని కార్మికులు ఆరోపించారు. దీంతో ప్రైవేటు అంబులెన్స్‌లో నగరానికి తీసుకెళ్లారు. ఖాజామియా జీతం నుంచి ప్రతినెలా ఈఎస్ఐ కోసం డబ్బులు కట్ అవుతున్నా కార్డు పనిచేయలేదు. ఈఎస్ఐలో నగదు జమకావడం లేదని చెప్పడంతో అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో ఆదివారం మృతిచెందాడు.

మృతదేహంతో ఆందోళన

కాంట్రాక్టర్ పని ఒత్తిడి కారణంగానే ఖాజామియా మృతిచెందాడని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతదేహంతో వెళ్లి ఫ్యాక్టరీ గేటు ఎదుట బైఠాయించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు శరణు బసప్ప, రాజ్‌కుమార్, భరత్‌కిషోర్, అనిల్, జర్నప్ప వీరికి మద్దతు తెలిపారు. అంబులెన్స్ ఇవ్వకపోడం, ఈఎస్ఐలో నగదు జమ చేయకపోవడంపై కంపెనీ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగారు. ఏఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బందితో వెళ్లి ఆందోళనకారులతో మాట్లాడారు. మృతుడి కుటుంబానికి అత్యవసరంగా రూ.75 వేల నగదు, రూ.7 లక్షల ఇన్సూరెన్స్‌తో పాటు కుటుంబంలో ఒకరికి కాంట్రాక్ట్ ఉద్యోగం ఇస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వంట చెరకుకు వెళ్లిన యువకుడు..

శవమై తేలాడు


పకీరప్ప మృతదేహం

యాలాల: ఇంటి నుంచి వెళ్లిన ఓ యువకుడు నదిలో మృతదేహమై తేలాడు. ఈ సంఘటన విశ్వనాథ్‌పూర్ సమీపంలోని కాకరవేణి నదిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పట్టా పకీరప్ప(17) ఆదివారం ఇంట్లో వంట చెరకు(కట్టెలు) కోసం వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో పకీరప్ప తల్లి నర్సమ్మ యాలాల పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కాగా సోమవారం ఉదయం విశ్వనాథ్‌పూర్ కాకరవేణి నదిలో వ్యక్తి మృతదేహం తేలియాడుతుందంటూ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సిబ్బంది అక్కడకు చేరుకుని పంచనామా చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వైద్యం అందక..

రెండు గేదెలు మృత్యువాత


గేదెల కళేబరాలు

తాండూరు రూరల్: పశువైద్యం అందక రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండల పరిధిలోని బెల్కటూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన అశోక్ కుమార్ కొన్ని నెలల క్రితం రూ.2.30లక్షలు వెచ్చింది సంగారెడ్డి జిల్లాలో రెండు పాడి గేదెలు కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్నాడు. మూడు రోజుల క్రితం మేత, నీరు తీసుకోక ఓ గేదె అస్వస్థతకు గురైంది. వెంటనే ఆయన చెంగోల్ పశువైద్య కేంద్రంలో పనిచేసే సిబ్బందికి బాలకృష్ణకు ఫోన్‌లలో సమాచారం ఇచ్చారు. దీంతో బాలకృష్ణ చికిత్స చేసి వెళ్లాడు. తర్వాత మరో గేదె తీవ్ర అస్వస్థతకు గురైంది. బాలకృష్ణను సంప్రదిస్తే తాను అందుబాటులో లేనని చెప్పాడు. దీంతో ఆది, సోమవారాల్లో రెండు గేదెలు మృత్యువాత పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశాడు. పశువైద్యులు సరైన చికిత్స అందించకపోవడంతోనే గేదెలు మృత్యువాత పడ్డాయని రైతు ఆరోపిస్తున్నాడు. పాడి పోషణపైనే ఆధారపడి జీవిస్తున్నాని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరుతున్నాడు. ఇదే విషయమై పశువైద్యుడిని సంప్రదిస్తే నేను అందుబాటులో ఉన్నప్పుడు వైద్యం చేశానని.. రెండో రోజు లేకపోవడంతో వెళ్లలేదన్నారు. తాను డిప్యూటేషనపైనే చెంగోల్‌లో చేస్తున్నారు.

స్పెషల్ వెబ్‌పోర్టల్ ఏర్పాటు చేయండి

జీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ రాంరెడ్డి


మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సమస్యలను వివరిస్తున్న రాంరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: లేఅవుట్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖల సమన్వయ లోపంతో భూ యజమానులు, ప్లాట్ల యజమానులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని జీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, ఉప్పరిగూడ మాజీ సర్పంచ్ బూడిద రాంరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాసి సెక్రటేరియెట్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీ లేఅవుట్లు, జీహెచ్ఎంసీలో పరిధిలో లే అవుట్ల ద్వారా, సేల్‌డీడ్‌ల ద్వారా నాలా కన్వెర్షన్, రెవెన్యూ రికార్డుల్లో మ్యూటేషన్లు చేయకుండా ప్లాట్లు విక్రయించారన్నారు. ధరణి తప్పిదాలు పునరావృతం కాకుండా భూభారతిలో లోపాలు సరి చేసి భవిష్యత్‌లో ఆస్తి హక్కులపై వివాదాలు రాకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ప్లాట్లు, భూముల వివరాలను నమోదు చేసి సరైన వెబ్ పోర్టల్ ఏర్పాటు చేయాలన్నారు.

యువకుడి ఆత్మహత్య

మూసాపేట: అనుమానాస్పదంగా ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మహారాష్ట్ర, గంగలవాడి గ్రామానికి చెందిన కమలేష్ భరత్ (28) మూడు నెలల క్రితం నగరానికి వచ్చి సెంట్రింగ్ పని చేస్తున్నాడు. మూసాపేటలోని పటేల్ నగర్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 5న ఉదయం భరత్ తండ్రి వాసుదేవ్‌కు సెంట్రింగ్ మేస్త్రీ కుమారుడు ఫోన్ చేసి కమలేష్ చనిపోయాడని చెప్పాడు. మూసాపేటకు వచ్చి చూడగా భరత్ ఉరి వేసుకొని చనిపోయి ఉన్నాడు. కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భర్త మృతి.. కొడుకు కటకటాల్లోకి


సదానందం(ఫైల్)


పోలీసులు అదుపులో రమేశ్

షాబాద్: తాగిన మైకంలో తల్లితో గొడవ పడుతున్న తండ్రిని పక్కకు తోసేయడంతో ఆయన మృత్యువాత పడ్డాడు. ఓ వైపు భర్త మరణం.. మరోవైపు ఆయన మృతికి కారణమైన కొడుకు జైలుకు వెళ్లడంతో ఆ తల్లికి పుట్టెడు దుఃఖం మిగిలింది. ఈ ఘటన షాబాద్ ఠాణా పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పధిలోని దామర్లపల్లి గ్రామానికి చెందిన సదానందం(65) మద్యం సేవించి భార్య సుజాతతో గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో కుమారుడు రమేశ్ తల్లిదండ్రులను వారించేందుకు వెళ్లగా తండ్రి దాడికి యత్నించాడు. దీంతో రమేశ్ తండ్రి సదానందంను తోసేయడంతో కుప్పకూలాడు. వెంటనే షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. తండ్రి మృతికి కారణమైన వ్యక్తి రమేశ్‌ను సోమవారం రిమాండ్‌కు తరలించారు.